## వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ భేష్


నరేందర్‌ను సన్మానిస్తున్న వాకర్లు

మణికొండ: గడచిన ఐదేళ్లలో అభివృద్ధి చేసిన అనేక పార్కులతో ఎంతో మందికి మేలు జరుగుతున్నదని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజీ పార్కులో ఇటీవల వాకింగ్ ట్రాక్‌ను పునఃనిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో వాకర్లు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... ఉదయం, సాయంత్రం సమయంలో వందలాది మంది వాకింగ్ చేయటం, పార్కులలో సేద తీరుతున్నారన్నారు. వాకింగ్ ట్రాక్ పాడైపోవటంతో ఆయన దృష్టికి తీసుకెళ్లటంతో దానిని వెంటనే మరమ్మతు చేయించిన ఆయనకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, వాకర్లు పాల్గొన్నారు.

## యూ ట్యూబ్ చానల్‌పై కేసు

మణికొండ: ఓ నిర్మాణ సంస్థలోకి అనుమతులు లేకుండా ప్రవేశించటంతో పాటు సంస్థపై తప్పుడు వార్తలు ప్రచారం చేయటం, డబ్బులు డిమాండ్ చేశారనే ఫిర్యాదుతో ఓ యూట్యూబ్ చానల్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో మూసీ నది పక్కన నిర్మాణం చేపట్టిన శ్రీ ఆదిత్య కేడియా రియల్టర్స్ సంస్థ స్థలంలోకి ఈ నెల 13వ తేదీన మహాన్ న్యూస్ చానల్ ప్రతినిధిగా చెప్పి యామిని ప్రియాంక అనే మహిళ వచ్చి అనుమతులు లేకుండా ఫొటోలు, వీడియోలు తీసింది. దాంతో అక్కడే ఉన్న సైట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి వారించారు. అయినా ఆమె తమ సీఈఓ విజయ్‌కుమార్ యాదవ్ ఆదేశంతో వాటిని తీసుకుంటున్నానని వాదించింది. ఆమె తీసుకున్న ఫొటోలు, వీడియోలతో సదరు నిర్మాణ సంస్థపై వార్తా కథనం ప్రచారం చేయటంతో పాటు ఆమెతో పాటు వారి సంస్థ సీఈఓ పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారని సదరు నిర్మాణ సంస్థ ప్రతినిధి టి.బాలకృష్ణ ఈనెల 17వ తేదీన ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఫిర్యాదు ఆధారంగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం. తమకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేశామని, మరింత లోతుగా విచారణ చేస్తున్నామని పోలీసులు ధ్రువీకరించారు.

## ఆసిఫ్‌నగర్‌లోని వైన్స్, బార్‌లను తరలించాలి

గోల్కొండ: సామాన్య ప్రజలకు తలనొప్పిగా మారిన వైన్స్, బార్ షాపులను తొలగించాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆయన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికృష్ణను కలిశారు. ఈ సందర్భంగా ఆయన నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్‌లో వైన్స్, బార్‌ల కారణంగా ఏర్పడుతున్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. గత నెలలో ఓ వైన్స్ షాపులో ఓ వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారన్నారు. ఇక్కడ ఉన్న వైన్స్ షాప్‌లతో పాటు బార్ వద్ద మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు గొడవ లు జరుగుతున్నాయని, రోడ్డుపైన స్థానికులు నడవలేని పరిస్థితి ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రానికి భారీ మొత్తంలో వైన్స్, బార్ షాపుల వల్ల రాబడి వస్తుందని కానీ వీటి కారణంగా వేలాది మందికి తలనొప్పిగా మారాయన్నారు. నవంబర్ వరకు గడువు ఉన వైన్స్ షాపును ఇక్కడ నుంచి తరలించాలని ఆయన కోరారు. ఆయన వెంట దత్తాత్రేయనగర్, ఆసిఫ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో 'తిరంగా ర్యాలీ'

రాయదుర్గం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాయదుర్గంలో ప్రారంభమైన ర్యాలీ మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, నల్లగండ్ల, గుల్‌మొహర్‌పార్కు రోడ్డు మీదుగా ట్రిపుల్‌ఐటీ కూడలి, గచ్చిబౌలి కూడలి మీదుగా టెలికామ్‌నగర్ వరకు సాగింది. పెద్ద సంఖ్యలో బీజేపీ, బీజేవైఎం ,మహిళామోర్చా, ఇతర అనుబంధ సంఘాల జిల్లా, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 21న జాబ్ మేళా

మోతీనగర్: నిరుద్యోగ యువతకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మేనేజర్లు రాజశేఖర్, సంపత్ కుమార్, ఐ క్రియేట్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రావణిలు ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు కూకట్‌పల్లి, మెట్రో పిల్లర్ నంబర్ ఏ 827, ఐ క్రియేట్ కాలేజీలో జాబ్ మేళా జరగనున్నట్లు తెలిపారు. జావా, వెబ్ డిజైనింగ్ డెవలప్‌మెంట్, కాడ్ ఇంజనీరింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్స్, బ్యాంకింగ్, ఫార్మసీ, బీపీఓ ఉద్యోగాలకు సంబంధించిన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154084728, 9963172858 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# కలగానే మినీ రైతుబజార్

- తాజా కూరగాయలు దొరక్క ఇబ్బందులు
- అధిక ధరలకు విక్రయిస్తున్న స్థానిక వ్యాపారులు
- తప్పనిసరిగా మెహిదీపట్నం వెళ్లాల్సిందే...
- మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజానీకం



శాస్త్రిపురం: రాజేంద్రనగర్ పరిసరాల్లో మినీ రైతుబజార్ ఏర్పాటు స్థానికులకు కలగానే మిగిలిపోతున్నది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ఎక్కడైనా మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు చేసుకున్న విన్నపాలు బూడిదలో పోసిన పన్నీటి చందాన తయారవుతున్నాయి. గడచిన ఐదేళ్లుగా స్థానికంగా కొత్తగా చాలా కాలనీలే ఏర్పడ్డాయి. ఎక్కువగా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. వీరందరితోపాటు పరిసర ప్రాంతాలవారికి ప్రస్తుతం మెహిదీపట్నం రైతుబజారే దిక్కు. స్థానికంగా తాజా కూరగాయలు దొరక్క ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక వ్యాపారులు కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తుండటంతో వాటిని చాలామంది కొనలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

- ఇదిలా ఉండగా అత్తాపూర్ డివిజన్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయ పరిసర ప్రాంతాలలో విశాలమైన ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలంలో మినీ రైతుబజార్ ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రాజేంద్రానగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వారాంతపు సంతలు నడుస్తున్నాయి. వాటిలోనూ కూరగాయల ధరలు అధికంగానే ఉండటం, తాజాగా లేకపోవడంతో ప్రజలు వాటిల్లో కొనేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పలు కాలనీలో ఈ వారాంతపు సంతల కారణంగా స్థానికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొటున్నారు.
- తాజా కూరగాయల కోసం శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలోని 30 కాలనీల వారితో పాటు బుద్వేల్, రాజేంద్రనగర్ పరిసరాలో ఉన్న 30 కాలనీల ప్రజతో పాటు ఈ ప్రాంతాలలో ఉన్న మెస్‌లు, హోటళ్ల నిర్వహించే వారు మెహిదీపట్నం రైతుబజార్‌కు రావాల్సి వస్తోంది. ఇది దూరాభారమని వారు వాపోతున్నారు. హైదర్‌గూడ లాంటి కొన్ని ప్రాంతాలలో మాత్రమే సంతలకు గిరాకీ ఉంటుంది. ఈ నేపథ్యంలో మినీ రైతుబజార్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండటమే కాకుండా దూరాభారం తగ్గి తక్కువ ధరలకే తాజా కూరగాయలు లభిస్థాయనడం నిర్వివాదాంశం.

# ఆవులను అమ్మితే చర్యలు

- నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి


పశువ్యాపారుల సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్, ఇన్‌స్పెక్టర్

మణికొండ: బక్రీద్ పండగను పురస్కరించుకుని పశువ్యాపారులు ఆవులను అమ్మవద్దని నార్సింగి పోలీసు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్ సూచించారు. సోమవారం నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంతో వారు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చట్ట ప్రకారం ఆవులను అమ్మటం, వాటిని కోయటం లాంటివి చేయవద్దన్నారు. నార్సింగిలో కొనసాగే పశు సంతలో ఎట్టి పరిస్థితిలోను వాటిని విక్రయించవద్దన్నారు. ఇక్కడ నుంచి తీసుకుని వెళ్లే క్రమంలో ఆవులు ఎక్కడైనా లభిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, వ్యాపారులు పాల్గొన్నారు.

# నేడు శంషాబాద్‌లో తిరంగా ర్యాలీ


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

శంషాబాద్: పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా తగిన గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు, ప్రధాని నరేంద్రమోదీకి దేశ ప్రజల మద్దతుగా తిరంగా ర్యాలీని మంగళవారం శంషాబాద్‌లో నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు ర్యాలీని ప్రారంభించి పురవీధుల్లో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. దేశప్రజల సమైక్యతను చాటేందుకు ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, సీనియర్ నాయకులు నదకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ వ్యర్థాలను తొలగించాలి

- బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం


అలకాపూర్ టౌన్‌షిప్‌లో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: పోగవుతున్న నిర్మాణ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ పద్ధతిలో మున్సిపాలిటీ సిబ్బందే తరలించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సోమవారం అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్-4లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ వ్యర్థాలు, అధిక చెత్త ఉన్నపుడు తొలగించే వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రజలు రోడ్ల పక్కన వాటిని పారబోయరన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గతంలో జలమండలి తరఫున ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు కనుమరుగయ్యాయన్నారు. వాటిని మున్సిపాలిటీ తరఫున తిరిగి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరి కొన్ని రోజుల్లో వర్షాలు కురుస్తాయని, అంతలోపు వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అనేక రోడ్లు గుంతలు పడి ప్రజలు ఇబ్బందిగా మారాయని వాటికి ప్యాచ్ వర్కులు చేయించాలన్నారు. పందెన్‌వాగులో వస్తున్న మురుగు నీరు నెక్నాంపూర్ చెరువులో కలవకుండా చేస్తే దుర్గంధంతో పాటు దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. నార్సింగి మిలట్రీ హనుమాన్ దేవాలయం నుంచి బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ వరకు పెండింగ్‌లో ఉన్న లింక్ రోడ్డు పనులను పూర్తి చేయించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఉపాధ్యక్షుడు ఆర్. ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, షేక్ ఆరిఫ్, సుమ నళిని, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవాలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. గంధంగూడ, పీరంచెరువు పరిధిలో శ్రీ ఎల్లమ్మ పోచమ్మ, కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో టింకురెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్‌ముదిరాజ్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 'ఖేలో సమ్మర్ స్ప్రింట్స్'లో రాణించిన అథ్లెట్లు


అథ్లెట్లు అన్విన్, అనన్యలతో కోచ్ రామకృష్ణారెడ్డి

మణికొండ: 3వ ఖేలో హైదరాబాద్ సమ్మర్ స్ప్రింట్స్ ఫెస్టివల్-2025 క్రీడా పోటీలలో మణికొండకు చెందిన అథ్లెట్లు రాణించారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఆదివారం పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా 60 మీటర్ల పరుగు పందెంలో అండర్-10 విభాగంలో అనన్య బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించినట్టు కోచ్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇదే పోటీలో మరో విద్యార్థి అన్విన్ అండర్ 12 వయసు 300 మీటర్ల విభాగంలో రజత పతకాన్ని సాధించినట్టు ఆయన వివరించారు. అన్ని రకాల క్రీడలలో రాణించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని క్రీడాపోటీలలో పాల్గొనేలా చేసి మరిన్ని పతకాలను సాధించేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా చదువులతో పాటు క్రీడలలోనూ పిల్లలను రాణించేందుకు వారి తల్లితండ్రులు డాక్టర్ రాంబాబు, వనజలు ఎంతో ప్రోత్సహిస్తున్నారని కోచ్ పేర్కొన్నారు.

## పరిశీలన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కు కొత్వాల్‌గూడలో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్టు తయారీ ప్రక్రియను కమిషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. ప్రతి ఇంట్లో నుంచి సేకరించిన రోజు వారీ చెత్తలో వచ్చిన పొడి చెత్తను రీసైకిల్ చేసి రీయూస్ చేయాలని, తడి చెత్తతో కంపోస్టు తయారు చేసి మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తిప్రదాత పుచ్చలపల్లి సుందరయ్య


కాటేదాన్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సోమవారం మండల నాయకులు కల్లేపల్లి ప్రకాష్ అధ్యక్షతన కాటేదాన్‌లో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఎందరికో ఆదర్శమని అన్నారు. సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినా చిన్ననాటి నుంచి అంటరానితనం, కుల వివక్ష అసమానతలను సహించే వారు కాదన్నారు. కుల వ్యవస్థను మార్చాలన్న ఆయన తల్లిదండ్రులు పెట్టిన సుందరరామిరెడ్డి అనే పేరును కుల సూచికగా ఉన్నందున తన పేరును సుందరయ్యగా మార్చుకున్న గొప్ప సామాజిక స్పృహ కలిగిన మంచి నాయకుడు అని అన్నారు. అలాంటి వ్యక్తిని నేటి సమాజం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బలరాం, అంజయ్య, ఫరీదాబీ, అంజయ్య, రమేష్, కృష్ణ, లక్ష్మణ్ తదిరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉపాధ్యాయులకు ట్రైనింగ్

అత్తాపూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యను అందించేందుకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీసింగ్ ట్రైనింగ్ మంగళవారం నుంచి శనివారం వరకు జరుగుతుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేవత్ శంకర్‌రాథోడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఐదు రోజుల శిక్షణకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరుకావాలన్నారు. ఈ శిక్షణలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎంలు ఐదుగురు ఆర్పీలు పాల్గొంటారన్నారు. అత్తాపూర్‌లో ఇడిపై స్కూల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.



## కాటేదాన్ మీదుగా వాహనాల మళ్లింపు


దుర్గానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలను కాటేదాన్ మీదుగా మళ్లింపు చేపట్టారు. ఈ పనులను పర్యవేక్షించి ఆయన మాట్లాడుతూ ఆరాంఘర్ వద్ద రైల్వే వంతెన కింద సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయన్నారు. దీని కారణంగా దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ఉదయం 8 గంటల నుంచి 15 రోజుల పాటు కాటేదాన్ ఓకేఆర్ ద్వారా మళ్లిస్తామన్నారు. ప్రజలు, వాహనాదారులు ఈ విషయాన్ని గమనించి ట్రాఫిక్ సజావుగా సాగేలా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.




## మియాపూర్-బెంగుళూర్ మారతహళ్లికి ఏసీ బస్సులు

మియాపూర్: మియాపూర్ డిపో పరిధిలోని మియాపూర్ ఎక్స్‌రోడ్డు నుండి బెంగుళూర్ (మారతహళ్లి)కి లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు అందుబాటులో ఉన్నాయని డిపో-1 మేనేజర్ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.20 గంటలకు మియాపూర్ ఎక్స్ రోడ్డు నుండి బయల్దేరి నిజాంపేట్ ఎక్స్ రోడ్డు, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, మెహిదీపట్నం, ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు శంషాబాద్ మీదుగా బెంగుళూరు వెళ్తుందని తెలిపారు. అదేవిధంగా బెంగుళూర్ మారతహళ్లి నుంచి ప్రతిరోజు రాత్రి 8.30 గంటలకు బయల్దేరుతుందని చెప్పారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు


శంషాబాద్-షాబాద్ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

## ప్రయాణం.. ప్రమాదకరం

రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న మార్గంలో కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. శంషాబాద్-షాబాద్ రహదారి వెడల్పు పనుల్లో భాగంగా బీటీ రోడ్డు వేయగా.. దారి మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను తొలగించలేదు. దీంతో రాత్రి వేళలో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురుకు స్తంభాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్తంభాలపై ప్రమాదకర సూచికలను ఏర్పాటు చేయడంలో అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఒయాసిస్ పాఠశాల సమీపంలో రహదారిలో బీటీ పూర్తి చేసిన ప్రాంతంలో రోడ్డు మధ్యలో ఆరు స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. రెండు స్తంభాల వద్ద బారికేడ్లను పెట్టి ఊరుకున్నారు. మిగతా స్తంభాలకు ఎలాంటి హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయలేదు. గత పది రోజులుగా వాహనదారులు ప్రమాదకర స్థితిలో ప్రయాణం కొనసాగిస్తున్నారు.

– శంషాబాద్ రూరల్

# ప్రజాసమస్యలను పరిష్కరించాలి


డీసీకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నేత వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌కు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ బస్తీ బీటీ రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. ప్రజలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. స్ట్రీట్ లైట్‌లు సైతం వెలగడం లేదని చాలా ప్రాంతాల్లో అంధకారం నెలకొని ఉంటుందన్నారు. దీని కారణంగా దొంగలు పడి ఇళ్లలోని సామగ్రిని దోచుకెళ్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఉపకమిషనర్ వెంటనే పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**జలమండలి జీఎంకు వినతి...**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వినాయక్‌నగర్ బస్తీలో మంచినీటి శివరేజ్ పైపులైన్‌లు వేయాలని డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ సోమవారం జలమండలి జీఎం సాయిలక్ష్మీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినాయక్‌నగర్‌లో శివరేజ్ పైపులైన్‌తో పాటు ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. నేతలు ఎస్.రాముయాదవ్, యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, చిరంజీవి, అరుణ్‌ముదిరాజ్, భూదేవి, అశోక్‌కుమార్, సురేష్‌ముదిరాజ్, నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.